ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

ఆదివారం 11 మే 2025 www.prajaswaramdaily.com 4 pm

# 'ఆపరేషన్ సిందూర్' కంటిన్యూ

## అప్పగించిన పనులను కచ్చితత్వంతో చేశాం

## ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

దిల్లీ: భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ భారత వాయుసేన కీలక ప్రకటన చేసింది. 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోందని తెలిపింది. దీనిలో భాగంగా తమకు అప్పగించిన పనులను అద్భుత నైపుణ్యాలతో అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేసినట్లు పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పోస్ట్ చేసింది. ఆపరేషన్స్ ఇంకా కొనసాగుతున్నందున అధికారికంగా వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. తప్పుడు సమాచారానికి దూరంగా ఉండాలని వాయుసేన కోరింది.



# పుల్వామా దాడి మా పనే

## మా అద్భుతమైన ఎత్తుగడ

## మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురత

## పాక్ వాయుసేనాధికారి అంగీకారం

ఇస్లామాబాద్ : కశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది పారామిలిటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబుదాడి వెనుక తమ హస్తం ఉందని ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ ప్రెస్‌మీట్‌లో అంగీకరించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో డీజీఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి, నేవీ ప్రతినిధితో కలిసి ఔరంగజేబ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "పాక్‌కు చెందిన గగనతలం, భూభాగం, జల సరిహద్దులకు లేదా ప్రజలకు ముప్పుగా పరిణమిస్తే.. వాటిని ఎదుర్కొనేందుకు మేం రాజీ పడబోం. దానిని పట్టించుకోకుండా ఉండలేం.. మా దేశానికి కట్టుబడి ఉంటాం. మా దేశ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో.. మేము ఎప్పుడూ దానిని నిలబెట్టుకుంటాం. పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించాం. మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించాం" అని వ్యాఖ్యానించారు. ఔరంగజేబ్ అహ్మద్ వ్యాఖ్యలతో పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందన్న విషయం మరోసారి స్పష్టమైంది. పుల్వామా దాడితో తమకు సంబంధం లేదని పాకిస్తాన్ ఎంత



బుకాయించినా .. తాజాగా వాయుసేనాధికారి వ్యాఖ్యలతో వాస్తవం బయటకు వచ్చింది.



# ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు

## రాహుల్ డిమాండ్

## ప్రధాని మోదీకి గాంధీ లేఖ..

న్యూఢిల్లీ : భారత్- పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆపరేషన్ సిందూర్ పై ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక, పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ గురించి ప్రజలకు తెలియజేయడం చాలా కీలకం అన్నారు. మన ముందున్న సవాళ్లను ఎదుర్కోవడానికి సమిష్టి కృషి అవసరం అని రాహుల్ గాంధీ ఆ లేఖలో పేర్కొన్నారు.

# ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

## సీఎం రేవంత్ చేతులమీదుగా రిలీజ్

## తొలి 10 ర్యాంకర్లు బాలురు

## మొదటి మూడు ర్యాంకులు ఏపీ వాసులకు




హైదరాబాద్: తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే వచ్చాయి. మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు దక్కాయి.

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్రకు మొదటి ర్యాంకు, నంద్యాల జిల్లా కోనాపురం వాసి ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డికి రెండో ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్‌కు మూడో ర్యాంకు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించింది. మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (మాదాపూర్)కు ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్‌రెడ్డి (మాదాపూర్) ఆరో ర్యాంకు, రష్మిత్ బండారి (మాదాపూర్) ఏడో ర్యాంకు, బనిబ్రత మాజీ (బడంగ్‌పేట్)కు ఎనిమిదో ర్యాంకు, కొత్త ధనుష్‌రెడ్డి (హైదరాబాద్)కు తొమ్మిదో ర్యాంకు, కొమ్మ కార్తీక్ (మేడ్చల్)కు పదో ర్యాంకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

### అగ్రికల్చర్-ఫార్మాలో..

అగ్రికల్చర్-ఫార్మా ఫలితాల్లో మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డికి మొదటి ర్యాంకు వచ్చింది. కరీంనగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్)కు రెండో ర్యాంకు, వరంగల్‌కు చెందిన అక్షిత్‌కు మూడో ర్యాంకు లభించాయి. సాయినాథ్ (కొత్తకోట, వనపర్తి)కు నాలుగో ర్యాంకు, బ్రాహ్మణి (మాదాపూర్)కి ఐదో ర్యాంకు, గుమ్మడిదల తేజస్ (కూకట్‌పల్లి)కు ఆరో ర్యాంకు, అఖిరానందన్‌రెడ్డి (నిజాంపేట)కు ఏడో ర్యాంకు, భానుప్రకాశ్‌రెడ్డి (సరూర్‌నగర్)కి ఎనిమిదో ర్యాంకు, శామ్యూల్ సాత్విక్ (హైదర్‌గూడ)కు తొమ్మిదో ర్యాంకు, అద్దుల శశికరణ్‌రెడ్డి (బాలాపూర్)కి పదో ర్యాంకు వచ్చాయి.

# సొంత భాషలోనే బదులివ్వాలి

## బ్రహ్మోస్ శక్తి గురించి తెలియకపోతే పాక్‌ను అడగండి

## ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిది

## : యోగి ఆదిత్యనాథ్

న్యూఢిల్లీ : బ్రహ్మోస్ ప్రభావం గురించి తెలియని వారెవరైనా ఉంటే.. పాకిస్తాన్‌ను అడిగి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి యోగి సూచించారు. లఖ్‌నవూలోని ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి ఉత్పత్తి యూనిట్‌ను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్‌లో భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని వెల్లడించారు. ఆ సమయంలో ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిదని.. దానిని సరిచేయాలంటే వారి సొంత భాషలోనే బదులివ్వాలని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ యూనిట్‌లో ఏటా 80 నుంచి 100 క్షిపణులను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోస్ క్షిపణులు 290 నుంచి 400 కి.మీ పరిధిని, మాక్ 2.8 రెట్ల గరిష్ఠ వేగాన్ని కలిగి ఉంటాయని తెలిపారు.

### నెక్స్ట్ జనరేషన్ క్షిపణులు

లఖ్‌నవూలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ ఫెసిలిటీ నుంచి ఏటా 100 బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేయడమే కాకుండా.. అదనంగా ప్రతి ఏడు 100 నుంచి 150 నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్ క్షిపణులను కూడా తయారు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు, సుఖోయ్ వంటి యుద్ధ విమానాలు ఒకే ఒక బ్రహ్మోస్ క్షిపణిని మోసుకెళ్లగలవు. అయితే, అవి ఇప్పుడు మూడు నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్ క్షిపణులను మోసుకెళ్లగలవని తెలిపారు. ఈ క్షిపణి 300 కిలోమీటర్లకు పైగా రేంజ్ వరకు దాడి చేయగలదు. ప్రస్తుత బ్రహ్మోస్ క్షిపణి 2,900 కిలోగ్రాముల బరువు ఉండగా.. నూతన క్షిపణుల బరువు 1,290 కిలోగ్రాములు ఉంటుంది.

2019లో తమిళనాడులో దేశంలోనే మొదటి డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను స్థాపించారు. ఇతర దేశాల నుంచి రక్షణ దిగుమతులను తగ్గించడం, స్వదేశీ ఉత్పత్తిని పెంచడం, ఉపాధిని సృష్టించడం వీటి ముఖ్య లక్ష్యం. భారత్, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్న సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులను భూమి, గాలిలోనే కాకుండా సముద్రాలలోనూ ప్రయోగించవచ్చు. ఇవి భారతదేశ రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.






# 12న హాట్‌లైన్‌లో భారత్-పాక్ చర్చలు

## హాజరుకానున్న ఇరు దేశాల డీజీఎంఓలు

## కాల్పుల విరమణ కొనసాగింపు. ఉద్రిక్త వాతావరణం కొనసాగింపు తదితర కీలక అంశాల ప్రస్తావన

న్యూఢిల్లీ : భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లు పాల్గొనున్నారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్ డీజీఎంవోతో పాకిస్తాన్ డీజీఎంవో హాట్ లైన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదించి.. వెంటనే అమలు చేద్దామని కోరారు.